క్లుప్తంగా

ఆహ్వానం

లాలాపేట: వచ్చేనెల 5న జూనియర్స్, 12న సీనియర్స్ విభాగాల్లో నిర్వహించనున్న ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ముఖ్యతిథిగా రావాలనీ శుక్రవారం వెటర్న్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, మధుబాబు, కృష్ణ, విజయ్‌కుమార్, దయాకర్,కుసుమ, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

లింబాద్రికి లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్ల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రిని రిఫ్రెషర్స్ కోర్సుకు హాజరు కావాలని ఓయూ లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్లు శుక్రవారం ఆహ్వానించారు. అనంతరం చైర్మన్ ప్రొ.లింబాద్రి చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించారు. లాంగ్వేజెస్ (భాష కోర్సులు), లింగ్విస్టిక్స్ కోర్సుల అధ్యాపకులకు రీఫ్రెషర్స్ కోర్సు (ఆర్‌సీ)ను నిర్వహించనున్నట్లు విభాగం హెడ్ ప్రొ.ఎండీ అన్సారీ, బీవోఎస్ ప్రొ.డాక్టర్ స్వాతి తెలిపారు.

ప్రొ. రాజేశ్వరరావుకు అడిషనల్ డీఎంఈగా పదోన్నతి



రాజేశ్వరరావును సన్మానిస్తున్న వైద్యులు, విద్యార్థులు

గాంధీఆస్పత్రి: గాంధీ ఆస్పత్రి మైక్రోబయోలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రాజేశ్వరరావుకు అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం జరిగిన అభినందన సమావేశంలో ప్రొఫెసర్ రాజేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ యూనిట్ అధ్యక్షునిగా, గాంధీ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరరావు సేవలను గుర్తించిన ప్రభుత్వం అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి నూతనంగా ఏర్పాటైన ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మం మెడికల్ కాలేజీలో వైద్యవిద్యకు అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవనీత, పూజ, అర్చన, సాధ్య, జిగిషా పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన సూపరింటెండెంట్



గాంధీఆస్పత్రి: తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారిని శుక్రవాంర గాంధీ సూపరింటెండెంట్ రాజారావు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గాంధీఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలను ఆమెకు వివరించారు. 2020 ఏప్రిల్ 20న తనను గాంధీ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ శాంతికుమారి ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

చిట్టి చేతులు.. పెద్ద ప్రయోగాలు

- సీసీఎంబీలో ఫ్యూచర్ సైంటిస్టు శిక్షణలో విద్యార్థులు
- దేశ వ్యాప్తంగా 8,9,10 తరగతుల విద్యార్థులకు వైఏపీ
- 250 పాఠశాలల నుంచి 26 మంది ఎంపిక
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డా. వినయ్ నందికూరి



లాలాపేట: దేశ విదేశాల్లో డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడాలని చాలా మంది ఆటు వైపు అడుగులు వేస్తుంటారు. సైంటిస్ట్ కావాలని తక్కువ మంది ఆసక్తి కనబరుస్తారు. పాఠశాల స్థాయి నుంచే 8, 9, 10వ విద్యార్థులకు బేసిక్ సైన్స్‌పై అవగాహన కల్పించడం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ ఫ్యూచర్‌లో సైంటిస్టులుగా స్థిరపడి దేశానికి అవసరమైన పరిశోధనలు చేయాలనే ఉద్దేశంతో సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలోజి (సీసీఎంబీ) గత 10 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం (వైఏపీ) నిర్వహిస్తుంది.

పది రోజుల పాటు శిక్షణ..

దీనికిగాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు పది రోజుల పాటు సీసీఎంబీలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా పాఠశాలల నుంచి ఎంపిక చేసిన హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, సూర్యాపేట తదితర జిల్లాల్లోని పాఠశాలల నుంచి 26 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఈ నెల 3న వైఏపీ శిక్షణ ప్రారంభమై 12న ముగిసిందని కోఆర్డినేటర్స్ డా.సాయదత్త కక్కర్, డా. భరత్ ఆతే, బీవీ రామకృష్ణ తెలిపారు. ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశామన్నారు.



పేపర్‌తో డీఎన్‌ఏ నమూనా తయారు చేసి చూపిస్తున్న విద్యార్థి

యువతకు చేరువ చేయాలనే

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం డైరెక్టర్ డా. వినయ్ నందికూరి సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. గత పదేళ్ల నుంచి యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200 మంది 8,9,10 తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు రాగా వారిలో ఎంపిక చేసిన 25 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. వైఏపీ వంటి కార్యక్రమం ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీలో జరుగుతున్న పరిశోధనలను యువతకు చేరువ చేయాలనేది దీని ప్రధాన ఉద్దేశమన్నారు.

సైంటిస్టులతో విద్యార్థులను మమేకం చేస్తూ..



విద్యార్థుల్లో సైన్స్ పట్ల, సైన్స్ పరిశోధనల పట్ల క్యూరియాసిటీని కల్పించడంతో పాటు సైంటిస్టులకు కావాల్సిన నాలెడ్జ్‌ను విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా కొందరైనా మన దేశానికి సైంటిస్టులు అబ్దుల్ కలాం లాగా తయారు అవుతారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని 2013లో ప్రారంభించాం. సైంటిస్టులతో విద్యార్థులను ఇంటరాక్ట్ చేస్తూ ల్యాబ్‌లలో సైంటిస్టులు చేస్తున్న పరిశోధనలు స్వయంగా చూపించడం, క్లెమైజ్, ప్రొటీన్, పేపర్‌తో డీఎన్‌ఏ తయారు వంటి గేమ్స్ ద్వారా విద్యార్థుల్లో లైఫ్ సైన్స్ బయాలజీ పట్ల ఆసక్తిని ప్రేరేపించడం జరుగుతుంది.

– డా. వినయ్‌కుమార్ నందికూరి డైరెక్టర్

కణాలను ప్రత్యక్షంగా చూశాం



తరగతి గదిలో పాఠ్య పుస్తకంలో చదువుకున్న పరిశోధన అంశాలను ఈ శిక్షణ ద్వారా ప్రత్యక్షంగా చూసే భాగ్యం కల్గింది. సైంటిస్టుల సహాయంతో కణాలు ఏలా ఉంటాయి. డీఎన్‌ఏ, కేన్సర్ సెల్స్‌ను గుర్తించడం, యానిమల్ కన్జర్వేషన్ వంటి పరిశోధనాలను తెలుసుకున్నాం. భవిష్యత్‌లో బైపీసీ కోర్సు చదివి సైన్స్ పరిశోధనలపై దృష్టి సారిస్తాం

– ఎం. మనోజ్, పదో తరగతి సూర్యాపేట్

సైంటిస్టుగా రాణిస్తా



పుస్తకాల్లో చదివిన ప్రయోగాలను సైంటిస్టుల సహకారంతో తామే స్వయంగా చేయడంతో రెండింతల విజ్ఞానం లభించింది. ఈ విజ్ఞానం తమకు జీవితాంతం గుర్తుండిపోతుంది. కరోనా వైరస్, కేన్సర్ సెల్స్‌ను స్వయంగా చూశాం. ఈ అవకాశం చాలా గొప్పది. జీవితంలో సైంటిస్టుగా స్థిరపడి దేశాభివృద్ధి, మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేస్తాం.

– శ్రద్ధారెడ్డి, పదో తరగతి, జాన్సన్ గ్రామర్ స్కూల్

ఆటలతో సైన్స్ విజ్ఞానం



వైఏపీ శిక్షణలో సైన్స్ పరిశోధనలను స్వయంగా చూడటంతో పాటు సైంటిఫిక్ గ్రేమ్స్‌తో సైన్స్ విజ్ఞానాన్ని సంపాదించుకున్నాం. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. సీసీఎంబీ లాంటి పరిశోధనా సంస్థలో ప్రతి ఏటా నిర్వహించే ఈ శిక్షణకు విద్యార్థులు హాజరై సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.

– అబు బక్కర్ షాదీక్ మధనీ. 9వ తరగతి మలక్‌పేట

సందడిగా 'హిందూ' క్రీడోత్సవం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్ 35వ వార్షిక క్రీడోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థుల ఆటపాటలతో క్రీడోత్సవ వేదిక హోరెత్తింది. జాతీయతను తట్టిలేపేలా స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథలు, వారి త్యాగాలను నృత్యం ద్వారా తెలియపరిచిన తీరు అబ్బురపరిచింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడతూ.. చిన్నతనం నుంచే దేశభక్తి భావాలను నూరిపోసేలా హిందూ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఏ రంగంలో ఉన్నా విద్యార్థులు నైతిక విలువలను పాటించడం మరువొద్దన్నారు. నిర్దిష్ట లక్ష్యంపై గురిపెట్టి దాని సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ట్రస్ట్ సభ్యులు త్రిపాఠి, కంజర్ల చంద్రకళయాదవ్, సూర్యనారాయణ, చంద్రశేఖర్‌గుప్తా, ప్రిన్సిపల్ రాధిక పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో కేంద్రం నిర్లక్ష్యం వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న బీజేపీయే మాదిగల దృష్టిలో నంబర్ వన్ దోషి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం పార్శిగుట్టలోని కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీని బీజేపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. 2014 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని వర్గీకరణ చేస్తామని బహిరంగంగా తెలిపారని అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా వర్గీకరణపై ఎలాంటి స్పష్టత లేదన్నారు. శనివారం నుంచి ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులను కలిసి వినతిపత్రాలు సమర్పించి రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. వర్గకరణపై బీజేపీ నుంచి స్పందన రాకపోతే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ నేతల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనాథ పిల్లల కోసం జిల్లాకో రెసిడెన్షియల్ పాఠశాల కట్టిస్తామని, ముందుగా యాదగిరిగుట్టలో తొలి రెసిడెన్షియల్ స్కూల్ ప్రకటన చేసిన సీఎం కేసీఆర్ స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, నేతలు తిప్పారపు లక్ష్మణ్, రాజు, విజయరావు, సోమశేఖర్, సామ్యూల్, నందారం సీతారం, డప్పు మల్లికార్జున్, నర్సింగరావు పాల్గొన్నారు.

న్యూబోయిన్‌పల్లి క్రీడా మైదానంలో వాలీబాల్ మ్యాచ్

రసూల్‌పురా: ఈ నెల 15న ఆర్మీ డేను పురస్కరించుకుని ఇండియన్ ఆర్మీ ఔట్రిచ్ కార్యక్రమంలో భాగంగా న్యూబోయిన్‌పల్లి క్రీడా మైదానంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో శుక్రవాంర వాలీబాల్ మ్యాచ్ జరిగింది. ఇండియన్ ఆర్మీ టీమ్, కార్ప్స్ ఆఫ్ ఈఎంఈ టీమ్ హైదరాబాద్ జిల్లా జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి మిలిటరీ కాలేజ్ అధికారి మహాబత్రా, స్పోర్ట్స్ ఆఫీసర్ కేప్టెన్ అతుల్ యాదవ్, ఎస్ఎం సెంటర్ అధికారి చంద్రబాన్ తివారి, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్, పోటీల స్పాన్సర్ సామల రాఘవరెడ్డి హాజరయ్యారు. ఈ పోటీల్లో ఇండియన్ ఆర్మీ జట్టు, కార్ప్స్ ఆఫ్ ఈఎంఈ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. ప్రభుకుమార్ గౌడ్, రఘు చరణ్, నందకిషోర్, ప్రకాష్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



సనత్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి దివంగత మర్రి చెన్నారెడ్డి పేరిట బీజేపీ నాయకుడు షేక్ గౌస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. 25 ఏళ్లుగా మర్రి చెన్నారెడ్డి పేరిట వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి బాటసారుల దాహం తీర్చడంతో పాటు ప్రతియేటా ఆయన పేరుపై కేలండర్‌ను రూపొందించడం పట్ల మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మర్రి శశిధర్‌రెడ్డి, వివేక్, చింతల రాంచంద్రారెడ్డి, రాంచందర్‌రావు, శ్యాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

దోస్తులతో కలిసి పతంగులు ఎగరేసేవాళ్లం!



పతంగులు పంపిణీ చేస్తున్న పద్మారావు



పతంగులను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

చిలకలగూడ: పతంగులు ఎగురవేయడం తనకెంతో సరదా అని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు మ్యాకల ఇంద్రన్న ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పతంగుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మకర సంక్రాంతికి దోస్తులతో కలిసి మిద్దెపైకి చేరి పతంగులు ఎగురవేస్తు సందడి చేసే వాళ్లమని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చిన్నారులు, యువకులకు పతంగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, శైలజ, నాయకులు పాల్గొన్నారు.

న్యూబోయిన్‌పల్లిలో..

రసూల్‌పురా: సంక్రాంతి సంబురాల్లో భాగంగా న్యూబోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు టింకు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. అనంతరం గంగిరెద్దును మల్లారెడ్డి ఆడించారు. ఈ కార్యక్రమంలో సులేమాన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిమ్‌లో మైనర్ రహస్య ఫొటోలు తీసిన అన్నదమ్ములు

ఇరువురి అరెస్టు



రాజు యాదవ్



రవి యాదవ్

రసూల్‌పురా: ఫిట్నెస్ సెంటర్‌లో జిమ్ చేస్తున్న ఓ మైనర్ బాలిక ఫొటోలు తీసి మార్ఫింగ్ చేసి వేధింపులకు పాల్పడుతున్న నిర్వాహకులపై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్ వివరాల ప్రకారం.. సెంటర్ పాయింట్ వద్ద ఫిట్‌నెస్ ఆర్ జోన్‌లో స్థానికంగా ఉన్న ఓ మైనర్ బాలిక జిమ్ చేస్తుండగా శిక్షణ ఇస్తున్న సమయంలో సన్నిహితంగా ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న నిర్వాహకులు రవియాదవ్, రాజుయాదవ్ సోదరులపై బాలిక కుటుంబ సభ్యులు, భవన యజమాని సాద కేశవరెడ్డి ఫిర్యాదు చేయడంతో ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరిపి వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను బ్లాక్ మెయిలింగ్ చేసి 20 తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరాణాలు, రూ. 4.50 లక్షలు తీసుకున్నారన్నారు. బాలిక జిమ్ చేస్తున్న సమయంలో ఆమె శరీర భాగాలను తాకుతూ ఉన్న ఫొటోలను రహస్యంగా తీసి బాలికను బెదిరింపులకు గురి చేసినట్లుగా తెలిపారు. ఇంతకు ముందు మరో నలుగురు యువతులను కూడా ఇదే విధంగా ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముగ్గులు వేస్తూ.. మురిపిస్తూ..



సంక్రాంతి పురస్కరించుకుని సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో యవతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్శిగుట్టలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి బహుమతులను అందజేశారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం



ముగ్గులను పరిశీలిస్తున్న కావ్యారెడ్డి, దీపికా నరేష్



ముగ్గులను పరిశీలిస్తున్న శ్రీగణేష్



నగదు బహుమతి అందజేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



ముగ్గులు వేసిన విద్యార్థులు



రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు



బన్సీలాల్‌పేట్ బండమైసమ్మనగర్‌లో ..

వాహనాల తనిఖీలు



అమీర్‌పేట: సంక్రాంతి నేపథ్యంలో నగరం నుంచి సొంతూళ్లకు వెళ్తున్న నేపథ్యంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం మధురానగర్, కళ్యాణ్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలు, వ్యక్తులను ఆపి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ.. ఊళ్లకు వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదని అలా చేస్తే దొంగలు ఆ ఇళ్లను టార్గెట్ చేస్తారన్నారు.

తుకారాంగేట్‌లో..

అడ్డగుట్ట: సంక్రాంతి పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తుకారాంగేట్ ఎస్ఐ శివరాజ్ సూచించారు. శుక్రవారం తుకారాంగేట్‌లో సుభాష్ బొమ్మ వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, కారులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి పంపిస్తున్నారు. సరైన నంబర్ ప్లేటు లేని వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న: ఏసీపీ శంకర్‌రాజు



అవగాహన కల్పిస్తునన్న ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: రోడ్డు నిబంధనలు ఉల్లంఘించడంతో ఏటా ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని, వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని యువత గుర్తించుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. నేషనల్ రోడ్డు సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని వరుణ్ మోటార్స్ వర్క్‌షాప్ ఉద్యోగులకు శుక్రవాంర రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రాణపదంగా చూసుకునే తల్లిదండ్రులతో పాటు మనపై ఆధారపడ్డ భార్యా పిల్లలను దృష్టిలో పెట్టుకుని సురక్షిత డ్రైవింగ్ చేయాలన్నారు. మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయారాదన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ జయచంద్ర, సిబ్బంది అబ్దుల్ మాజీద్‌ఖాన్, చిరంజీవి, సుమన్, శ్రావణ్, జనరల్ మేనేజర్ బి.శ్రీనివాస్, ఏజీఎం ఎస్.శ్రీనివాస్, ఎండి.అజ్మత్ పాల్గొన్నారు.

కిమ్స్–సన్‌షైన్ ఆస్పత్రి ఆడిటోరియంలో..

రాంగోపాల్‌పేట్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరుగవని బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్–సన్‌షైన్ ఆస్పత్రి ఆడిటోరియంలో బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడరు. సిగ్నల్ జంప్, ఓవర్ స్పీడ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌లతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో తలకు గాయాలై మృత్యువాత పడుతున్నారని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పకుండా పెట్టుకోవాలన్నారు.

చింత ఎల్లస్వామికి డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎకనామిక్స్ విభాగం పరిశోధన విద్యార్థి చింత ఎల్లస్వామి రైతుల ఆత్మహత్యల పై పరిశోధన చేశారు. ప్రొ.రాములు పర్యవేక్షణలో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు–రైతు కుటుంబాల స్థితిగతులు అనే అంశం పై జరిపిన శోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. తన పరిశోధనల ద్వారా రైతులను ఇంకా ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించినట్లు ఎల్లస్వామి తెలిపారు.